

సాక్షి ఒడిశా

మంగళవారం । 28 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,99,616లు, బంగారం 37.85 గ్రాములు, వెండి 215 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అందరి కృషితోనే సమగ్ర రక్షణ - 8లో

'నయాగర్' కేసులో సవ్యసాచికి విముక్తి



భువనేశ్వర్: తీవ్ర కలకలం రేపిన నయాగడ్ రిజర్వ్‌లో మావోయిస్టు దాడి కేసులో సవ్యసాచి పండాకు విముక్తి లభించింది. మావోయిస్టు అగ్రనేత సవ్యసాచి తోపాటు మంజులత ముదులి, ప్రతాప్ కింబిక లను ఈ కేసులో న్యాయస్థానం నిర్దోషులుగా ప్రకటించింది. ఈ మేరకు నయాగడ్ జిల్లా జడ్జి సెషన్స్ కోర్టు తీర్పును సోమవారం వెల్లడించింది. నయాగడ్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మావోయిస్టుల దాడుల్లో 9 కేసుల్లో ఇప్పటి వరకు 5 కేసుల్లో సవ్యసాచి నిర్దోషిగా తేలారు.

న్యూస్‌రీల్

మా సతొభౌణి చైత్ర జాతర ప్రారంభం



వంశధార వద్ద కలశ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఐటీడీఏ కార్యాలయానికి సమీపంలో ఉన్న మా సతొభౌణి వార్షిక చైత్ర జాతర ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. గత 11 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ జాతరలో భాగంగా సమీపంలోని వంశధార నది నుంచి కలశాలతో శుద్ధ జలాలను తీసుకువచ్చారు. వీటిని అమ్మవారి మందిరంలో నిలపడంతో జాతరకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాలను తిలకించేందుకు పరసర గ్రామాల నుంచి ఏటా వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. వారి సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. 3 రోజులు కొనసాగే ఈ జాతరలో రోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమం కొనసాగుతుందని కమిటీ సభ్యులు బిభుప్రసాద్ నాయక్, ఉమామహంతి, ఎస్. సూరి, బ్రజసుందర్ పాఢి తెలిపారు.

మత్తిలి సమితిలో బీఎస్‌ఎఫ్ శిబిరం



జవాన్లు అందించిన సామగ్రితో గిరిజనులు

మల్కన్‌గిరి: జిల్లాలోని 2వ బెటాలియన్ బీఎస్‌ఎఫ్ జవాన్లు మత్తిలి సమితి తెంతులిగుమ్మ పంచాయతీలో సోమవారం జనసంపర్క శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగాబెటాలియన్ అదనపు కమాండర్ బీఎస్ రావత్ హాజరై, పంచాయతీకి సమీపంలోని అలమగూగ, తీలకనగర్, బెజనిగూడ, మటిగూఢ, టేకగూడ గ్రామాలకు చెందిన గిరిజనులకు చీరలు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ జవాన్లు, తెంతులిగుమ్మ సర్పంచ్ మధుమతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగులైమాత ఊరేగింపు నేడు



కాలరాత్రి అలంకారంలో జగులైమాత

భువనేశ్వర్: ఖుర్దారోడ్ కుదియారి గ్రామదేవత జగులైమాత వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మంగళవారం గ్రామం వీధుల్లో ఊరేగించనున్నారు. ఉదయం సూర్య పూజ అనంతరం ప్రత్యేక పల్లకిలో ఊరేగిస్తారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఇంటి ముంగిట కల్లాపి చల్లి, పరిశుభ్ర పరచి గ్రామ దేవతకు స్వాగతం పలుకుతారు. ఈ సందర్భంగా పూర్ణ కలశంతో దీపం సమర్పించాలని ఉత్సవ నిర్వాహక కమిటీ తెలిపింది. సమయాభావంతో ఊరేగింపు పురస్కరించుకుని అమ్మవారికి ప్రసాదాల నివేదన నివారించినట్లు ప్రకటించారు. వసంత నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని జగులై మాత సోమవారం కాల రాత్రి అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

చిరుధాన్యాలతో ఎంతో మేలు

జయపురం: చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్‌చంద్ర మిశ్రా తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ విభాల ఉద్యోగులు, విద్యార్థుల మధ్య చిరుధాన్యాల వినియోగంపై పోటీలు జరిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ చిరుధాన్యాలైన రాగి, జొన్నలు, సామలు, కొర్రలు, గంటెలు, ఊదలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. అత్యధిక పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఒడిశా మిల్లెట్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ దివ్యశ్రీ టోప, సభ్యులు నిభితా సాహు, జగన్నాథ్ తదితరులు చిరుధాన్యాల వినియోగ ఆవశ్యకతను వివరించారు. అలాగే క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రభాతి పాణిగ్రహి, ఎన్. పద్మావతి, దుర్గాప్రసాద్ పాత్రొ, భగవాన్ శాబత్, సోమనాథ్ సాకియ, రశ్మిత నాయక్, కల్యాణి నాయక్, విశ్వరంజన్ గౌఢ, కె.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అనర్హత వేటు.. ప్రజాస్వామ్యానికి చేటు



నల్ల దుస్తుల్లో శాసనసభలో కాంగ్రెస్ సభ్యుల నిరసన

- అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆందోళన
- రాహుల్‌గాంధీ పట్ల కేంద్రం తీరుపై నిరసన
- దేశ చరిత్రలో బ్లాక్ డేగా అభివర్ణన
- గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందించిన నాయకులు

భువనేశ్వర్: రాహుల్‌గాంధీపై లోక్‌సభకు అనర్హత వేటు వేయడంపై ఒడిశా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నల్లబట్టలు ధరించి అసెంబ్లీలో గందరగోళం సృష్టించారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు సభ ప్రశ్నోత్తరాల సమయంలో సమావేశమైన వెంటనే కాంగ్రెస్ సభ్యులు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. 'దొంగలందరికీ ఇంటి పేరు మోదీ అని ఎందుకు ఉంది?' వ్యాఖ్యలపై లోక్‌సభ సభ్యుడిగా రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా ఆందోళనకు దిగారు. దీంతో సభ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. సమావేశాలు ప్రారంభమైన మరుక్షణం నుంచే స్పీకర్ పోడియం చుట్టుముట్టడంతో పాటు తమ నాయకుడిని ఎంపీగా అనర్హులుగా ప్రకటించడాన్ని ప్రజాస్వామ్య హత్యగా అభివర్ణించారు. సభా కార్యకలాపాల అధ్యక్షత చేయి దాటడంతో వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ బిక్రమ్‌కేశరి అరూఖ్ ప్రకటించారు.

నల్ల దుస్తులు, టోపీలతో..

అంతకుముందు, ప్రతిపక్ష శాసనసభ్యులు రాహుల్‌పై అనర్హత వేటుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అసెంబ్లీ భవనం వద్దకు చేరుకున్నారు. కేంద్రం చర్యను ప్రజాస్వామ్యాన్ని 'హత్య' చేయడంగా అభివర్ణించారు. దేశంలో నియంతృత్వాన్ని సహించబోమని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి మాట్లాడుతూ బీజేపీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆరోపించారు. ఈ చర్యలను నల్ల దినం(బ్లాక్ డే)గా పాటిస్తున్నామని, నిరసనకు ప్రతీకగా పార్టీ ఎమ్మెల్యేలు నల్లబట్టలు, టోపీలు ధరించారని బాహినీపతి వివరించారు. ప్రజాస్వామ్యం మనుగడతో దేశం బాగు ముడిపడి ఉందని పేర్కొన్నారు.

చట్ట ప్రకారమే నిర్ణయం..

కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరు పట్ల భారతీయ జనతాపార్టీ నాయకుడు, ప్రతిపక్ష నేత జయనారాయణ్ మిశ్రా విరుచుకు పడ్డారు. రాహుల్‌గాంధీపై చట్ట ప్రకారమే కోర్టు చర్యలు తీసుకుందన్నారు. దీనిని ప్రజాస్వామ్య హత్య అని ఎలా అంటారని నిలదీశారు. ఎమర్జెన్సీ కాలంలో అందరినీ కటకటాల వెనక్కి నెట్టిన వారే.. ప్రస్తుతం ప్రజాస్వామ్యం కోసం వాదిస్తున్నారని ఎద్దేవా చేశారు. 1951లో కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారమే నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఎదురు దాడికి దిగారు.

స్పీకర్ అభ్యర్థన నిర్లక్ష్యం..

ఆర్థిక, హోం, గనుల వంటి ముఖ్యమైన శాఖలపై అసెంబ్లీలో చర్చ జరుగుతోందని, సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లాలని స్పీకర్ బిక్రమ్‌కేశరి అరూఖ్ కాంగ్రెస్ విజ్ఞప్తి చేశారు. అయితే ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేస్తూ తమ నిరసనను నిరవధికంగా కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో స్పీకర్ సభను వాయిదా వేశారు. దీంతో ప్రశ్నోత్తరాలకు గండిపడింది.

ప్రజలే నిర్ణయిస్తారు..

ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం అసెంబ్లీ లోపల, వెలుపల నిరసనను కొనసాగిస్తున్నామని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తెలిపారు. భారత పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ స్వరాన్ని నులిపేందుకు అనర్హత వేటు వేశారని ఆరోపించారు. లోక్‌సభలో విపక్ష నాయకుడిగా రాహుల్ దాడిని ఎదుర్కోలేక, ఆయనపై అనర్హత వేటు వేశారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రయత్నం జరిగిందా లేదా అనేది దేశ ప్రజలే నిర్ణయిస్తారని ప్రకటించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పలువురు ముఖ్యమంత్రులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటే, చిట్‌ఫండ్, మైనింగ్ స్కామ్‌లపై సీబీఐ, ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు భయపడి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎలాంటి ప్రకటన చేయడం లేదని ఓపీసీసీ చీఫ్ ఆక్షేపించారు.



భారత రాష్ట్రపతిని ఉద్దేశించిన వినతిపత్రాన్ని, గవర్నర్ గణేషీలా లీకు అందిస్తున్న కాంగ్రెస్ సభ్యులు



శాసనసభ వెలుపల నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్, వామపక్షాల నాయకులు

ప్రజాస్వామ్యం, న్యాయ వ్యవస్థకు భద్రత కల్పించాలి

భువనేశ్వర్: దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ, న్యాయ వ్యవస్థకు హామీ పూర్వక భద్రత కల్పించాలని కాంగ్రెస్ కూటమి ప్రముఖులు భారత రాష్ట్రపతిని అభ్యర్థించారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఉద్దేశించిన వినతి పత్రాన్ని రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ(ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ అధ్యక్షతన బీజేపీ, బీజేడీయేతర రాజకీయ పక్షాల కూటమి ప్రముఖుల ప్రతినిధుల బృందం రాజ్‌భవన్‌ను సందర్శించారు. పార్లమెంట్‌లో కుప్పకూలుతున్న ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ దిశలో గళం విప్పే విపక్ష సభ్యులకు వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం బలవంతపు చర్యలు పాల్పడుతోందని తెలియజేశారు. ఈ చర్యలను నిలదీసే వారిపై అక్రమంగా సీబీఐ, ఎన్‌ఫోర్సుమెంట్, ఐటీ దాడులు చేపట్టి, కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. ఈ తీరు ప్రజాస్వామ్య వ్యవస్థను నిలువునా ఖూనీ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో భారత న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా వేలెత్తి చూపి అవమానకర చర్యలకు పాల్పడటంలో కేంద్రం ఏమాత్రం వెనుకంజ వేయడం లేదన్నారు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి భారత ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించి, భద్రతకు హామీ కల్పించాలని లిఖిత పూర్వకంగా అభ్యర్థించారు.

మజ్జిగౌరి హుండీ ఆదాయం రూ.45 లక్షలు

- వివిధ బ్యాంకుల్లో మొత్తం రూ.30 కోట్ల డిపాజిట్లు



పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. కానుకల రూపంలో రూ.45,01,249ల ఆదాయం సమకూరినట్లు మందిర మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక వెల్లడించారు. అదేవిధంగా హుండీలో 29 గ్రాముల బంగారం, 1,169 గ్రాముల వెండి లభించినట్లు తెలిపారు. మందిర ప్రాంగణంలోని మొత్తం 9 హుండీలను మందిరం కమిటీ సభ్యులు రాధాకాంత దొళాయి, దేవేంద్ర బెహరా, పెద్దిన వాసు ఆధ్వర్యంలో తహసీల్దార్ తపస్ రౌత్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుజిత్ కుమార్ పూజారి సమక్షంలో తెరిచారు. లెక్కింపు పూర్తయ్యే సరికి 9గంటల సమయం పట్టిందన్నారు. పట్టణానికి చెందిన వేంకటేశ్వర మందిరం సేవాసమితి, సత్యసాయి సేవాసమితి, జిమ్స్ కళాశాల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. హుండీ నుంచి లభించిన ఆదాయాన్ని స్థానిక ఉత్కళ గ్రామీణ బ్యాంకులో డిపాజిట్ చేస్తామని రాయిసింగి ప్రకటించారు. ఇప్పటి వరకు అమ్మవారి పేరిట వివిధ బ్యాంకుల్లో సుమారు రూ.30 కోట్ల నగదు డిపాజిట్ రూపంలో ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిని మందిరం అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రతి 3 నెలలకు హుండీ తెరిచి, లెక్కింపు చేపడుతున్నామన్నారు. 2022 డిసెంబర్ జరిగిన లెక్కింపులో రూ.62,22,059ల నగదు, 46 గ్రాముల బంగారం, 1,775 గ్రాముల వెండి లభించిందని గుర్తుచేసారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, కమిటీ సభ్యులు

పోక్సోపై కక్షిదారులకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి సత్యనారాయణ మిశ్రా

జయపురం: సమాజంలో అన్యాయాలకు గురయ్యే బాధితులకు పోక్సో చట్టంపై అవగాహన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో కొరాపుట్ న్యాయసేవా ప్రాధికరణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో జిల్లా న్యాయమూర్తి సత్యనారాయణ మిశ్రా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో బాధితులకు పునరావాస కల్పన, న్యాయం, ఉద్యోగం, వైద్య సౌకర్యం, నష్ట పరిహారం లభిస్తాయని వివరించారు.

అలాగే వివిధ విభాగాల అధికారులు, పోలీసులు చట్టంపై అవగాహన కల్పించారు. శిబిరంలో జిల్లా అదనపు న్యామూర్తి ఈబీ రావు, ఫ్యామిలీ కోర్టు జడ్జి పవిత్ర మోహన శామల్, పోక్సో న్యాయమూర్తి సీహెచ్ వాసుదేవ్ పాత్రొ, సీనియర్ జడ్జి ముషారత్ జహీన్, మహిళా కోర్టు న్యాయమూర్తి అంజలి మాచ్‌ఖండ్, జిల్లా న్యాయసేవా ప్రాధికరణ కార్యదర్శి సుమన్ జెనా, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆదర్శ కుమార్ బెహర, సీడీఎంఓ డాక్టర్ ప్రశాంతకుమార్ శామల్, జిల్లా ఆస్పత్రి అధికారి రవీంద్రనాథ్ మిశ్రా, సీడబ్ల్యూసీ అధ్యక్షుడు గాయత్రిపాత్రొ, ప్రభుత్వ న్యాయవాది డాక్టర్ గాయత్రీదేవి, డీఎస్పీ సుమిత్రా జెనా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల చెంతకు ఈపీఎఫ్ అధికారులు



మాట్లాడుతున్న ఈఓ ప్రభాత్‌కుమార్ మహరాణ

- గుసానిలో ఈపీఎఫ్ నిధి ఆప్‌కీ నికత్ 2.0 కార్యక్రమం



సదస్సులో పాల్గొన్న ప్రభుత్వ అధికారులు, జేడీ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు

పర్లాకిమిడి: ఉద్యోగుల భవిష్యత్ నిధి(ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయం, బరంపురం ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు గుసాని సమితి కార్యాలయంలో ప్రభుత్వ, జేడి పరిశ్రమల యాజమాన్యం, ప్రైవేటు అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. ప్రభుత్వ, అసంఘటిత కార్మికులకు ఈపీఎఫ్ అధికారులు అండగా ఉన్నారని, దీనికోసమే కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నిధి ఆప్‌కీ నికత్ 2.0' కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. ప్రభుత్వ, అసంఘటిత కార్మికులకు ప్రతి నెలా భవిష్యత్ నిధిలో 12శాతం జమ చెయ్యాలని, వారికి 58 ఏళ్ల వచ్చినప్పుడు పింఛన్ సౌకర్యం కల్పిస్తున్నామని ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి ప్రభాత్ కుమార్ మహరాణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఈపీఎఫ్ చలానా ఎలా చెల్లించాలి? ఉద్యోగుల బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం అనే అంశాలపై మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈపీఎఫ్ కేంద్ర కార్యాలయం రూ.35 వేల కోట్లను వివిధ సంస్థలలో పెట్టుబడి పెట్టిందన్నారు. 2024 నాటికి అసంఘటిత, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ పెన్షన్లు మంజూరుపై కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ యోచిస్తోందని ప్రకటించారు. కార్యక్రమంలో సమితి అభివృద్ధి అధికారి నీలమాధవ్ మాఝి, జిల్లా కార్మికశాఖ అధికారి లోకనాథ్ పండా, బ్లాక్ అకౌంటెంట్ గజేంద్ర బెహరా, అధికారులు గదాధర్ మాఝి, జేడి పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలకు బీజేడీ పరిశీలకుల నియామకం

- జాబితాను విడుదల చేసిన పార్టీ కార్యాలయం



ఈశ్వర్ పాణిగ్రాహికి మిఠాయి తినిపిస్తున్న పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ఈశ్వర్



బీజేడీ జిల్లాల పరిశీలకులు

భువనేశ్వర్: రాష్ట్రంలో 30 జిల్లాలకు బిజూ జనతాదళ్ కొత్త పరిశీలకులను నియమించింది. ఈ మేరకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆమోదించిన తాజా జాబితాను బీజేడీ కేంద్ర కార్యాలయం సోమవారం విడుదల చేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి(ఆర్గనైజింగ్) ప్రణబ్‌ప్రకాష్ దాస్ అంగుల్, ఢెంకనాల్, కెంజొహర్, సంబల్‌పూర్‌తో సహా నాలుగు జిల్లాలకు పరిశీలకుడిగా నియమితులయ్యారు. అలాగే సీనియర్ నేతలు అతుస్ సవ్యసాచి నాయక్, కెప్టెన్ దివ్యశంకర్ మిశ్రాకు రెండు జిల్లాల చొప్పున బాధ్యతలు కేటాయించారు. మిగిలిన వారికి ఒక్కో జిల్లా చొప్పున కేటాయించారు. అతుస్ సవ్యసాచి నాయక్ గజపతి, రాయగడ జిల్లా పరిశీలకులుగా, కొరాపుట్, మల్కన్‌గిరి జిల్లాలకు కెప్టెన్ దివ్యశంకర మిశ్రా నియమితులయ్యారు. గత ఏడాది అక్టోబర్‌లో విడుదల చేసిన పరిశీలకుల జాబితాలో ఉన్న సీనియర్ నాయకులు టుకుని సాహు, ఉషాదేవి, రోహిత్ పూజారిని బాధ్యతల నుంచి తొలగించారు. తాజా జాబితాలో రవీంద్రకుమార్ జెనా(ఖుర్దా), అమరేష్ జెనా(దేవ్‌ఘడ్), దేబేష్ ఆచార్య(సోన్‌పూర్)కు చోటు కల్పించారు.

నవరంగ్‌పూర్‌కు ఈశ్వర్ పాణిగ్రాహి..

కొరాపుట్: బీజేడీ నవరంగ్‌పూర్ జిల్లా పరిశీలకుడిగా ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి నియమితులయ్యారు. కొరాపుట్ జిల్లాకు చెందిన ఆయన.. ప్రస్తుతం కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ పదవిలో వరుసగా రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బబిదాస్‌ను కొరాపుట్ స్పెషల్ సర్క్యూట్ హౌస్‌లో సోమవారం కలుసుకున్నారు. తనకు అవకాశం కల్పించడంలో సహకరించిన దాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇరువురూ కలిసి మల్కనగిరి జిల్లా పర్యటనకు వెళ్లారు. ఈశ్వర్ నియామకం పట్ల నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి, రాష్ట్ర స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సలహాదారుడు ప్రదీప్ మాఝి, నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీ, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ మజ్జి వేర్వేరు ప్రకటనలో అభినందించారు.

రూ.3 కోట్ల విలువైన గంజాయి పట్టివేత



చిత్రకొండ పోలీసులకు పట్టుబడిన 3,333 కిలోల గంజాయి

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి డైక్–3 సమీప అడవిలో భారీగా గంజాయి రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆ ప్రాంతంపై దాడి చేశారు. అయితే పోలీసుల రాకను గమనించిన దుండగులు ముందుగానే పరారయ్యారు. 132బస్తాల్లో ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం మేజిస్ట్రేట్ సమక్షంలో తూకం వేయగా 3,333 కిలోలు ఉన్నట్లు చిత్రకొండ ఐఐసీ ముకుందో మల్కా తెలిపారు. దీని విలువ రూ.3 కోట్లకు పైగా ఉంటుందని వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

గవర్నర్‌కు కాగ్ నివేదిక



గవర్నర్ గణేషీలాల్‌కు నివేదికను అందిస్తున్న కాగ్ అధికారులు

భువనేశ్వర్: రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై కాగ్ నివేదికను ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఆడిట్ రాజ్‌కుమార్ రాష్ట్ర గవర్నర్ గణేషీలాల్‌కు సోమవారం సమర్పించారు. ఒడిశా శాసనసభలో ఈ నివేదికను ప్రవేశ పెట్టేందుకు వీలుగా గవర్నర్‌కు సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

పర్లాకిమిడిలో రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలు



అభిమానులకు కేకు తినిపిస్తున్న మోనంగి కిరణ్

పర్లాకిమిడి: పట్టణంలోని నటరాజ్ థియేటర్ ఆవరణలో తెలుగు సినీ హీరో రామ్‌చరణ్ పుట్టినరోజు వేడుకలను చిరంజీవి అభిమాన సంఘం సభ్యులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వాకర్స్‌క్లబ్ సహాయ కార్యదర్శి మోనంగి కిరణ్‌కుమార్ కేకు కట్ చేసి, అభిమానులకు పంచిపెట్టారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు ద్వారా పట్టణంలోని అనేక మందికి రక్తాన్ని అందిస్తున్నామని తెలిపారు. ధర్మారావు, అలిజింగి రాము, శ్యామ్, కృష్ణ, హరి, అభి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు

బొబ్బిలి: పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. ఈనెల 28 నుంచి ఐదురోజుల పాటు రాజస్థాన్‌లో జరిగే ఈ పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో జి చరిత, బి.యశస్విని, క్యాడెట్ విభాగంలో జి జాహ్నవి పాల్గొంటారని చెప్పారు.

ఇసుక లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

దత్తిరాజేరు: మండలంలోని గడసాం సమీపంలో సోమవారం తెల్లవారు జామున బీటి రోడ్డుపై అదుపు తప్పి ఇసుక లారీ బోల్తా పడినట్లు పెదమానాపురం ఎస్సై బి.భాగ్యం తెలిపారు. ఒడిశా నుంచి అన్ని అనుమతులతో వైజాగ్ వెళ్తున్న లారీ వర్షానికి అదుపు తప్పినట్లు చెప్పారు. అయితే అదృష్టవశాత్తు డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయట పడ్డారన్నారు.


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



లారీ ఢీకొట్టడంతో విరిగిన విద్యుత్ స్తంభం

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని పోలీస్‌స్టేషన్ దారిలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత పెనుప్రమాదం తప్పింది. ఇసుకతో వెళ్తున్న లారీ ఒక్కసారిగా అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం పూర్తిగా విరిగిపోయింది. అదే సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఏఎస్సై రమణమ్మ ఘటనపై అప్రమత్తమై లారీ డ్రైవర్, క్లీనర్‌లను పరిశీలించి చిన్నగాయాలతో ఉన్న వారిని సామాజిక ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ సిబ్బంది పవర్ సప్‌లై నిలిపివేశారు. సోమవారం కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

డస్ట్‌బిన్ పెట్టమన్నందుకు దాడి



చికిత్స పొందుతున్న వెంకటరమణ

పార్వతీపురం: పార్వతీపురం పట్టణం బంధంవారి వీధిలో ఆయుర్వేదిక్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్న ఎస్.వెంకటరమణను, పక్కనున్న స్వీట్‌షాపు యజమాని గౌరీశంకరరావు రాయితో కొట్టి గాయపరిచాడు. వివరాలిలా ఉన్నాయి. స్వీట్ షాప్‌కు వచ్చిన వారు స్వీట్లు తినేసి ఆ చెత్తను తన షాపుముందు పడేస్తున్నారని, దీనివల్ల వ్యాపారానికి ఇబ్బందిగా ఉందని గౌరీశంకరరావును వెంకటరమణ ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి వెంకటరమణను రాయితో తలపై బలంగా గౌరీశంకరరావు కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బలరాం, సత్తిబాబులు క్షతగాత్రుడిని ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. అలాగే ఈఘటనలో గౌరీశంకరరావుకు కూడా కంటి పైభాగంలో దెబ్బతగలడంతో ఆయన కూడా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాభ్యున్నతే నా యిజం

- సీఎం నవీన్ పట్నాయక్
- గంజాం జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన



లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



సభా ప్రాంగణంలో కళాకారుల జోడు శంఖ నృత్యం

బరంపురం: రాష్ట్రంలోని పేదల అభ్యున్నతే నా యిజం, లక్ష్యం. నా నిరంతర కృషి రాష్ట్రాభివృద్ధికే అని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పునరుద్ఘాటించారు. ముఖ్యంత్రి సొంత జిల్లా గంజాంలో శనివారం పర్యటించి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హింజిలికాట్ నియోజకవర్గంలోని సమరజుల శంకర్ కంటి ఆస్పత్రి మైదానంలో 'మా గ్రామం మా అభివృద్ధి' బహిరంగ సభా కార్యక్రమం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. దేశంలో మొదటిసారిగా గంజాం జిల్లాలోని ఎన్‌ఏసీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని 2వేల మంది బస్తీవాసులకు 'భూమి అధికారి' పట్టాల పంపిణీ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇదో చారిత్రాత్మకమైన కార్యక్రమమన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకొనేందుకు ఎప్పుడూ ముందుంటానని ప్రకటించారు. గత 23 ఏళ్ల బీజేడీ పాలనలో 50కి పైగా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు గుర్తుచేశారు. తను మాటల మనిషిని కాదని, చేతల్లో అభివృద్ధి పనులు చేసి చూపుతానని స్పష్టంచేశారు.

పట్టాలతో రుణాలు..

ఎన్‌ఏసీ, పట్టణ, నగరాల్లో ఉన్న బస్తీవాసులకు తొలి దశలో 2.5 లక్షల మందికి 'భూమి అధికారి' పట్టాలు పంపిణీ చేసేందుకు లక్ష్యంగా చేసుకున్నామని, ఇప్పటికే 50శాతం పూర్తయ్యిందని సీఎం నవీన్ వెల్లడించారు. బస్తీవాసులు పొందిన భూమి హక్కుల పట్టాల ద్వారా బ్యాంకు రుణాలు, పిల్లల చదువులకు రుణాలతో ఉన్నత విద్య అభ్యసించవచ్చని తెలియజేశారు. దీని ద్వారా ఒకే కుటుంబంలో అందరూ విద్యావంతులయ్యే విధంగా ఉపయోగ పడుతుందన్నారు. తరుచూ వస్తున్న ప్రకృతి వైపరీత్యాల వల్ల అభివృద్ధికి కొంత ఆటంకం ఏర్పడుతుందని, అటువంటి సమయాల్లో నష్టపోయిన బాధితులకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాలను అందజేశారు.

సుడిగాలి పర్యటన..

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గంజాం జిల్లాలోని కబిసూర్యనగర్, హింజిలికాట్, ఛత్రపూర్‌లో సుడిగాలి పర్యటన చేశారు. సుమారు రూ.2 వేల కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం నీటి పారుదల, వ్యవసాయం, సంక్షేమం ఆరోగ్య పథకాలపై సబంధిత అధికార్లతో చర్చలు జరిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమ శాఖమంత్రి ఉషాదేవి, అస్కా ఎంపీ ప్రమీలా బిశాయి, బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్‌పండా, 5–టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్, కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢా, గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా, అధికారులు పాల్గొన్నారు.



హింజిలికాట్‌లో బిజూ బాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం



ప్రజా సంక్షేమ పథకాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి నవీన్



బహిరంగ సభలో జనసందోహం

అందరి కృషితోనే సమగ్ర రక్షణ

- ప్రతి పౌరుడు దేశ ప్రగతికి కృషి చేయాలి
- జయపురం ఉగాది ఉత్సవాల్లో సీనియర్ నటులు సుమన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటులు సుమన్

జయపురం: దేశం సమృద్ధిగా అభివృద్ధి చెందినప్పుడే ప్రజలంతా సురక్షితంగా ఉండవచ్చని ప్రముఖ సినీనటులు సుమన్ తల్వార్ అన్నారు. జయపురం నారాయణీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం రాత్రి జరిగిన ఉగాది ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన ఆయన.. అనంతరం మాట్లాడారు. కరోనా సమయంలో పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు, వైద్యులు, సిబ్బంది, సైనికులు తమ ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా దేశ ప్రజలకు సేవ చేశారని గుర్తుచేశారు. అటువంటి వారంతా త్యాగధనులను అభినందించారు. దేశ సమగ్రాభివృద్ధికి ఇది నిదర్శనమన్నారు. ప్రతి పౌరుడు దేశ ప్రగతికి కృషి చేసినప్పుడే ప్రజలకు రక్షణ అన్నారు. ఇప్పటి వరకు 700లకు పైగా చిత్రాలలో నటించానని, శక్తి ఉన్నంత వరకు నటన కొనసాగిస్తానని ప్రకటించారు. జయపురంలో 50 శాతానికి పైగా తెలుగు వారు ఉండటం.. ఉగాది, సంక్రాంతి వంటి పండగలు ఒడియా ప్రజలతో కలసి ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రశంసించారు.

సెమిలిగుడలో సినీ స్టుడియో

జిల్లాలో సినిమాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు, బీజేడీ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరచంద్ర పాణిగ్రాహి తెలిపారు. దీనికి అనుగుణంగా సెమిలిగుడలో 600 ఎకరాల్లో ఫిల్మ్ స్టూడియో నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. కొరాపుట్ జిల్లాలో చిత్ర నిర్మాణాలు జరగాలని, దీనికి తామంతా సహకరిస్తామని ఈ సందర్భంగా సుమన్‌ను కోరారు. అనంతరం నిర్వాహకులు పలువురు ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమంలో జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, నిర్వాహకులు జి.రాంబాబు, హిమాంశు మహాపాత్ర, ఛత్తీస్‌గఢ్ ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మద్ది, జయపురం మాజీ వైస్ చైర్మన్ దుర్గాప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనలో విశాఖపట్నానికి చెందిన రాక్‌స్టార్ సుప్రీమ్ శేఖర్, సరిగమప, ఆర్ఆర్ఆర్ గాయని ప్రకృతి రెడ్డి, గాయకుడు వీరాస్వామి, తెలుగు ఐడల్ సింగర్ ప్రసన్న తమ పాటలతో ప్రేక్షకులను అలరించారు. విశాఖ డైనమిక్ లయన్స్ డ్యాన్స్ బృందం తమ నృత్య ప్రదర్శనతో హోరెత్తించారు. జయపురం హెచ్‌కే రియల్ ఎస్టేట్ హిమాంశు మహాపాత్రా, పీఆర్ కన్సల్టెన్సీ రమేష్ దాస్ తదితరులు సహకరించారు.



మీడియాతో మాట్లాడుతున్న సుమన్



తన పాటలతో అలరిస్తున్న ప్రకృతి రెడ్డి



పాటలు, హావభావాలతో ఉర్రూతలూగించిన సుప్రీమ్ శేఖర్

హత్య మిస్టరీని ఛేదించిన పోలీసులు

- భర్తే హంతకుడు
- అనుమానంతోనే భార్య హత్య
- ఒడిశా నుంచి వలసొచ్చి భద్రాచలంలో నివాసం



హత్య ఘటన వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): రాష్ట్ర సరిహద్దుల్లో ఈనెల 15న కలకలం రేపిన యువతి దారుణ హత్య ఘటన మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆమె భర్తే నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకుని కటకటాల్లోకి నెట్టారు. దీనికి సంబంధించి వివరాలను చింతూరు అడిషనల్ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సోమవారం స్థానిక పోలీసు స్టేషన్లో వెల్లడించారు. ఒడిశా లోని మల్కనగిరి జిల్లా కలిమెల తాలూకాలోని పులకనకొండ గ్రామానికి చెందిన సొంది రామ్, సొంది కుమార్ ఎనిమిదేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతేడాది నుంచి భార్యపై అనుమానం పెంచుకుని వేధిస్తుండగా వీరిద్దరి మధ్య కలహాలు రేగాయి. ఈ నేపథ్యంలో భార్య రామ్ అక్కడి నుంచి రెండు నెలల క్రితం వచ్చి తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలోని సుందర్యనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. విషయం తెలుసుకున్న భర్త కుమార్ 15 రోజుల క్రితం అక్కడకు వచ్చాడు. ఇద్దరికీ మద్యం సేవించే అలవాటు ఉండటంతో ఈనెల 14న రాత్రి ఎటపాక మండలం పురుషోత్తపట్టణం పంచాయతీ శ్రీరామ్‌నగర్ కాలనీ సమీప పొదల్లో భార్యకు పూటుగా మద్యం తాగించి తాను తాగుతున్నట్లు నటించాడు. అక్కడ నుంచి తిరిగి వస్తున్న క్రమంలో వెనుక నుంచి బండరాయితో ఆమె తలపై కొట్టి తీవ్రంగా గాయపర్చాడు. చనిపోయిందని నిర్ధారించుకుని ముళ్ల పొదల్లో మృతదేహాన్ని పడేసి, అక్కడ నుంచి పరారయ్యాడు.

నిందితుడు పట్టుబడింది ఇలా...

గుర్తుతెలియని యువతి దారుణ హత్యగా కేసు నమోదు చేసుకున్న ఎటపాక సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ పార్ధసారధి దర్యాప్తును వేగవంతం చేశారు. ఆమె గుర్తుల ఫొటోలతో కూడిన వివరాలు కరపత్రాలుగా ముద్రించి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోకి దర్యాప్తు బృందం వెళ్లి విచారణ చేసింది. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఎటపాక పోలీసులను సంప్రదించగా, మృతురాలు రామ్(33) భర్తే హంతకుడుగా అనుమానించి నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఈనెల 26న హంతకుడు కుమార్ తన భార్య నివాసం ఉన్న ఇంటికి వచ్చాడు. అక్కడ తన బట్టలు తీసుకుని హైదరాబాద్ కూలీ పనులకు బయలుదేరుతున్న సమయంలో పోలీసులకు చిక్కాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు మిస్టరీని చాకచక్యంగా త్వరగా ఛేదించిన సీఐ, ఎస్ఐ, మిగతా బృందాన్ని ఏఎస్పీ అభినందించారు.

స్టోన్ క్రషర్‌లో మృత్యుకేక

- బండరాయి పడి ఇద్దరు యువకుల దుర్మరణం
- మరొకరికి గాయాలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతిచెందిన సోములు, సుజిత్

సాలూరు: ఆ యువకులు పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రం నుంచి వచ్చారు. ఆదివారమే స్టోన్‌క్రషర్‌లో విధుల్లో చేరారు. రాళ్లకు రంధ్రాలు వేసే సమయంలో వర్షం కురవడంతో కొండదిగి సమీపంలోని షెడ్‌కు చేరుకున్నారు. వర్షం తగ్గాక పనిముట్లు తెచ్చుకునేందుకు వెళ్లిన యువకులను బండరాయి రూపంలో మృత్యువు కాటేసింది. కనిపించని లోకాలకు తీసుకుపోయి వారి కుటుంబాల్లో విషాదం నింపింది. సాలూరు మండలం కొత్తవలసలోని విజయ స్టోన్ క్రషర్‌లో సోమవారం జరిగిన ఘటనపై రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి తెలిపిన వివరాలు ఇలా... కొత్తవలసలోని విజయస్టోన్స్ క్రషర్ వద్ద పనిచేసేందుకు ఒడిశా లోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన పలువురు వ్యక్తులు ఇటీవల వచ్చారు. క్వారీ పనులు చేస్తున్న క్రమంలో కొండమీద డ్రిల్లింగ్ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇంతలో వర్షం ప్రారంభం కావడంతో పనిముట్లు అక్కడే వదిలేసి కిందకు దిగిపోయారు. సమీపంలోని షెడ్‌కు చేరుకున్నారు. వర్షం తగ్గిన తరువాత పనిముట్లు తెచ్చుకునేందుకు కొండమీదకు ఐదుగురు యువకులు వెళ్తుండగా ఓ పెద్ద బండరాయి సోములు(30) మీద పడటంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. తరువాత రాయి రెండు ముక్కలుగా పగిలి ఓ ముక్క సుజిత్(26)పై పడటంలో దుర్మరణం చెందాడు. మరో రాయి బడియం రాముకు తగలడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని వైద్యం నిమిత్తం సాలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్ఐ పరిశీలించారు. గాఢాంధకారంగా ఉన్న నేపథ్యంలో క్రషర్స్ సూపర్‌వైజర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతులిద్దరిదీ మల్కన్‌గిరి జిల్లా పొగురుకొండ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వెల్లువెత్తిన వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దివ్యజ్యోతి, సబ్ కలెక్టర్ అశుతోష్, ఎస్పీ వివేక్



పేదలకు భూమి పట్టాల పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు, కలెక్టర్ లింగరాజ్ పండా

బరంపురం: జిల్లా పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అర్జీదారులు హాజరై, వినతలను అందజేశారు. సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో తాగునీరు అందడం లేదని, ప్రభుత్వ పథకాలు అందడం లేదని పలువురు లబ్ధిదారులు వాపోయారు. రహదారులు, ఉపాధ్యాయుల బదిలీలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం తదితర సమస్యలపై వినతులు అందాయి. కార్యక్రమంలో బరంపురం సబ్ కలెక్టర్ అశుతోష్ కులకర్ణి, ఎస్పీ సరవణ్ వివేక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కిడిగాం పంచాయతీలో..

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ బ్లాక్ కిడిగాం పంచాయతీ కార్యాలయంలో గ్రామముఖి పరిపాలన, జాయింట్ గ్రీవెన్సుసెల్ కలెక్టర్ లింగరాజ్ పండా ప్రారంభించారు. ఇందులో జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఆర్‌డీఏ పీడీ రమాంచల్ ఖమారి పాల్గొన్నారు. కిడిగాం, గోరిబంద, బూదర, హడ్డుబంగి గ్రామాలకు చెందని ప్రజలు 49వినతులు అందించారు. ఇందులో 26 వ్యక్తిగతమైనవి కాగా, గ్రామ సమస్యలపై 23 వినతులు వచ్చాయి. అనంతరం సామాజిక న్యాయం కింద భృతి, భూపట్టాలు, గృహ నిర్మాణాలు, రేషన్‌కార్డులు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం, ప్రాథమిక విద్య, గ్రామాలకు రోడ్డు సౌకర్యంపై వినతులు ఉన్నాయి. గ్రీవెన్స్‌కు కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, సబ్ డివిజనల్ పోలీసు అధికారి రామకృష్ణపతి, బీడీఓ కపిలేశ్వర తండి, తహసీల్దార్ ఆశిష్ ప్రధాన్, గ్రీవెన్స్‌సెల్ నోడల్ అధికారి నర్మదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నలుగురు అరెస్ట్

విజయనగరం క్రైమ్: బట్టల షాపులో చోరీకి పాల్పడిన నలుగురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి బట్టలు, నగదు రికవరీ చేశారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సోమవారం స్థానిక కార్యాలయంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక బాలాజీ మార్కెట్‌లో షాప్ నంబర్ 304 యజమాని అరుణ్‌కుమార్ అగర్వాల్ ఈ నెల 23న రాత్రి షాపు మూసేసి ఇంటికి వెళ్లిపోయారు. ఎవరో గుర్తు తెలియని దొంగలు మారుతాళంతో షాప్ షట్టర్ తీసి, లోపలికి ప్రవేశించి దఫదఫాలుగా సుమారు రూ.లక్షా 90వేలు విలువైన బట్టల మూటలు దొంగిలించి పారిపోయినట్లు గుర్తించిన యజమాని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనానికి పాల్పడిన బొండపల్లి మండలం జియ్యన్నవలసకు చెందిన చుక్క, పడాల శంకర్, ఎర్రశ్రీను, పట్నాన అప్పలనాయుడులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 75వేల నగదు, పది బట్టల మూటలను రికవరీ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ఛేదించడంలో క్రియాశీలకపాత్ర పోషించిన ఎస్సైలు అశోక్ కుమార్, భాస్కరరావు, హెచ్‌సీ అచ్చిరాజు, సిబ్బందిని సీఐ అభినందించారు.

బొడ్డవలస పాఠశాల సంఘటనపై విచారణ



చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా సమన్వయకర్త చంద్రావతి

సాలూరు: మండలంలోని పీఎన్ బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన విద్యార్థుల మధ్య గలాటాపై రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా సమన్వయకర్త చంద్రావతి సోమవారం విచారణ చేపట్టారు. పాఠశాలకు వచ్చిన ఆమె విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

లీగల్ డిఫెన్స్ కౌన్సిల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంలో ఉచితంగా కేసులు వాదించేందుకు లాయర్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఓ ప్రకటనలో తెలిపారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అనే డిజిగ్నేషన్‌తో లాయర్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు పదేళ్ల క్రిమినల్ కేసులు వాదించడంలో అనుభవం, డిప్యూటీకి ఏడేళ్లు, అసిస్టెంట్‌కు మూడేళ్ల అనుభవం ఉండాలని సూచించారు. పోస్టులకు ఎంపికైన తర్వాత న్యాయవాదులు తమ సొంత కేసులు వాదించేందుకు వీలుండదని స్పష్టం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీగల్ ఎయిడ్ గ్రాంట్ చేసిన కేసుల్లో మాత్రమే వాదించేందుకు వీలుంటుందని తెలిపారు. దరఖాస్తులను అధ్యక్షుడు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థకు ఈ ఏడాది ఏప్రిల్ 7వ తేదీ లోపు అందించాలని సూచించారు.

'అడవి జంతువులను కాపాడాలి'

పాతపట్నం: ఫారెస్టులో జంతువులను ప్రతి ఒక్కరూ కాపాడాలని జిల్లా అటవీశాఖాధికారి (డీఎఫ్ఓ) నిషాకుమారి అన్నారు. పాతపట్నం మండల కేంద్రంలోని అంతరాబ ఫారెస్టును ఆమె సోమవారం పరిశీలించారు. ఇటీవల జింకలు కుక్కల దాడిలో చనిపోతుండడంతో అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. అడవి చుట్టూ ఉన్న గ్రామస్తులతో వన్యప్రాణ రక్షణ సమావేశాలు ఏర్పాటు చేసి, అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఆమెతో పాటు ఫారెస్ట్ రేంజర్ రాజశేఖర్, ఏసీఎఫ్ హారిక, సెక్షన్ అధికారి యశశ్వీరరావు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తుది దశకు ఇంటర్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పరీక్షలు తుది దశకు చేరుకుంటున్నాయి. సోమవారంతో హిస్టరీ గ్రూపు విద్యార్థుల పరీక్షలు ముగిశాయి. మంగళవారంతో ఇంటర్ ప్రథమ సంవత్సరం రెగ్యులర్ కోర్సుల పరీక్షలు ముగియనున్నాయి. రేపటితో ద్వితీయ సంవత్సరం (సీనియర్ ఇంటర్) రెగ్యులర్ కోర్సుల విద్యార్థుల పరీక్షలు ముగుస్తాయి. అయితే ఏప్రిల్ 4వ తేదీ వరకు ఒకటి రెండు కేంద్రాల్లో కేవలం పదుల సంఖ్యలో విద్యార్థులు మాత్రమే పలు బ్రిడ్జ్ కోర్సుల పేపర్లకు పరీక్షలు రాయనున్నారు.

10వ రోజు 910 మంది డుమ్మా..

పరీక్షల్లో భాగంగా సోమవారం సెట్-3 ప్రశ్నపత్రంతో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2కు పరీక్షలు రాశారు. జిల్లా వ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షల్లో భాగంగా మొత్తం 27,536 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 26,626 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 910 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ కోర్సులకు 25,625 మందికిగాను 836 మంది, ఒకేషనల్ కోర్సులకు 1911 మందికిగాను 74 మంది రాలేదు. మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదుకాలేదని జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు తెలిపారు.

కామాక్షమ్మకి పుష్పార్చన



పుష్పాలంకరణలో కామాక్షి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పాండురంగ వీధిలో ఉన్న కామాక్షి పీఠంలో అమ్మవారికి వసంత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు వేదుల వెంకటరమణశర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, పరిమళ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

రన్నింగ్ నీటి సౌకర్యంపై దృష్టి

● ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ట్రిపుల్ ఐటీ (రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం)లో రన్నింగ్ నీటి సౌకర్యంపై ప్రత్యేక దృష్టిపెడుతున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు చెప్పారు. ట్రిపుల్ ఐటీ ఎస్ ఎం పురం క్యాంపస్ పరిపాలన కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. ప్రస్తుతం శ్రీకాకుళం క్యాంపస్‌లో 3,500 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఐదు బోర్లతో నీటి సరఫరా చేస్తుండగా.. కొన్ని బోర్లతో సమస్యలు వస్తున్నాయన్నారు. నీటి కొరతను అధిగమించేందుకు రెండు బోర్లు త్వరలో వేస్తున్నట్లు చెప్పారు. నీటి కొరత వల్ల నిర్దేశించిన వేళల్లో నీటి సరఫరా కొనసాగుతోందన్నారు. భవిష్యత్తులో రోజంతా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. రూ. 24 లక్షలతో డ్రైనేజ్ వ్యవస్థ నిర్మిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కొన్ని రోజుల్లో నీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వం రూ.130 కోట్లు కేటాయించిందన్నారు. పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

సరస్వతీ నిలయం



సిక్కోలు సరస్వతీ నిలయంగా మారుతోంది. ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు జిల్లాలో అందుబాటులోకి వస్తున్నాయి. ఒకప్పుడు నిరక్షరాస్యతకు మారుపేరుగా నిలిచిన నేలపై ప్రస్తుతం శాస్త్ర, సాంకేతిక, వైద్య, ఇతరత్రా పరిశోధన కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, కొత్త కొత్త విద్యా సంస్థలతో నాడు వైఎస్ రాజశేఖర రెడ్డి ఉన్నత చదువులకు పునాదులు వేయగా.. నాడు-నేడు, విద్యా, వసతి దీవెన వంటి పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చదువులకు సాయం చేస్తున్నారు. దీంతో జిల్లా ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుతోంది. ఒకప్పుడు ఉన్నత చదువులు చదవాలంటే విజయనగరం, విశాఖ వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఐఐటీ, ఎన్ఐటీ విద్యా సంస్థలు మినహా మిగతా అన్ని విద్యా సంస్థలు మన దగ్గర ఉన్నాయి. ఇక్కడి వారు ఐఏఎస్, ఐపీఎస్ ఇతర ప్రభుత్వ ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. ఇతర జిల్లా విద్యార్థులు కూడా ఇక్కడకు వచ్చి చదువుకుంటున్నారు.

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

- అందుబాటులో శాస్త్ర, సాంకేతిక, వైద్య, పరిశోధన విద్యా సంస్థలు
- వేలాది మందికి జిల్లాలోనే ఉన్నత విద్య
- నాడు వైఎస్సార్, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి
- జిల్లాకు ప్రతిష్టాత్మక విద్యా సంస్థల రాక
- ఎడ్యుకేషనల్ హబ్‌గా తయారైన సిక్కోలు

కొత్త కొత్త చదువులు..

సీఎం వైఎస్ జగన్ జిల్లాకు కొత్తగా వ్యవసాయ, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేశారు. ఆమదాలవలస మండలం తొగరాంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రస్తుతం నడుస్తోంది. ఇక్కడ 34సీట్లు ఉన్నాయి. ప్రస్తుతం 25 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. ఆమదాలవలస మండలంలో దన్నానపేట గ్రామం సమీపంలో ప్రభుత్వ వెటర్నరీ కళాశాల తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఈ రెండింటికీ శాశ్వత నిర్మాణాలకు స్థలాలు కేటాయించారు.

- శ్రీకాకుళంలో రెండు నర్సింగ్ కళాశాలలు ఉన్నాయి.ఫిజియోథెరపీ, పారామెడికల్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 525 సీట్లు ఉండగా 1550మంది వరకు చదువుతున్నారు.
- శ్రీకాకుళం రూరల్‌లోని నైరాలో వ్యవసాయ కళాశాల ఉంది. 150 సీట్లు ఉండగా 600మంది చదువుతున్నారు.
- ఆమదాలవలసలో కృషి విజ్ఞాన కేంద్రం ఉంది. వ్యవసాయ పరిశోధనలు జరుగుతున్నాయి.
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణం జరుగుతోంది.

దంత వైద్య, బీ-ఫార్మసీ కళాశాలలు

జిల్లాలో దంత వైద్య, బీఫార్మసీ కళాశాలలు కూడా ఉన్నాయి. శ్రీకాకుళంలోని సాయిదంత వైద్య కళాశాలలో సీట్లు 180 ఉండగా 480 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర బీ ఫార్మసీ కళాశాలలో 198 మంది చదువుతున్నారు. చిలకపాలెంలోని శివానీ కళాశాలలో 198 మంది చదువుతున్నారు.

జిల్లాకే తలమానికం బీఆర్ఏయూ



వైఎస్సార్ పుణ్యమా అని జిల్లాలో ఏర్పాటైన బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ జిల్లాకే తలమానికంగా మారింది. ఇక్కడ ఇప్పుడు 21 కోర్సులు ఉన్నాయి. ప్రస్తుతం 2250 మంది విద్యార్థులు చదువుతున్నారు. విశ్వవిద్యాలయం పరిధిలో 101 డిగ్రీ, 14 బీఎడ్, 6 పీజీ, నాలుగు బీపీఈడీ, డీపీఈడీ కాలేజీలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో 41,000 మంది చదువుతున్నారు. విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కళాశాల కూడా ఉంది. ఇందులో ఐదు బ్రాంచ్‌లు ఉండగా 1096 మంది ఉన్నారు. వర్సిటీలో న్యాయ కళాశాల ఉంది. ప్రస్తుతం 132 మంది విద్యార్థులు చదువుతున్నారు. అనుబంధ కళాశాల ఎంపీఆర్‌లో 250 మంది ఉన్నారు.

అందుబాటులో ఇంజనీరింగ్ విద్య



జిల్లాలో ఏటా వేలాది మంది ఇంజనీర్లు తయారవుతున్నారు. మన జిల్లాలో అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు మూడు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 330, టెక్కలి ఐతంలో 864, చిలకపాలెం శివానీ 264, ఎచ్చెర్ల వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో 336 సీట్లు ఉన్నాయి. వీటిలో వేలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతున్నారు.

కొత్త కళాశాలలో సీటు



తొగరాం ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్‌లో చదువుతున్నాను. ప్రభుత్వం కొత్తగా ఈ కళాశాల ఏర్పాటు చేయడం వలన సులువుగా అడ్మిషన్ పొందగలిగాను. పట్టణ సమీపంలో తాత్కాలికంగా ఏరువాక కేంద్రం వద్ద హాస్టల్ ఏర్పాటు చేశారు.

– సీహెచ్ రోహిత్‌కుమార్, విద్యార్థి, వ్యవసాయ పాలిటెక్నిక్, రాజమండ్రి

ఇబ్బందులు తొలగాయి



ప్రభుత్వ వెటర్నరీ కళాశాలలో అన్ని వసతులు కల్పించారు. ప్రభుత్వం కొత్తగా శ్రీకాకుళం జిల్లాలో కళాశాల ఏర్పాటు చేయడం వల్ల వెంటనే సీటు పొందగలిగాను.

– డి.శివరామకృష్ణ, విద్యార్థి, వెటర్నరీ కళాశాల

ప్రైవేటులో మేటి జెమ్స్



ప్రైవేటు వైద్య కళాశాలగా జిల్లాలో జెమ్స్ మెడికల్ కళాశాల విశేష సేవలందిస్తోంది. మిగతా చోట్ల కంటే తక్కువ ఫీజుతో వైద్య సేవలందించడమే కాకుండా వందల సంఖ్యలో వైద్య సేవలందిస్తోంది. ప్రస్తుతం 750మంది ఎంబీబీఎస్ కోర్సును చదువుతున్నారు. పీజీ 261మంది చదువుతున్నారు. ఇక్కడ ఫిజియో థెరపీ కళాశాల, పారామెడికల్ ,నర్సింగ్ విద్యాసంస్థలు కూడా ఉన్నాయి. వీటిలో 1350మందికి పైగా ఆ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు.

ట్రిపుల్ ఐటీ



వైఎస్సార్ కలల విద్యా సంస్థ అయిన ట్రిపుల్ ఐటీ కూడా జిల్లాలోని ఎచ్చెర్లలో ఏర్పాటైంది. ఇప్పుడిది ఇంజనీర్లను తయారు చేస్తోంది. గత ప్రభుత్వంలో కేవలం 2వేలలోపు పరిమితమైన అడ్మిషన్లు ఇప్పుడు 4వేలకు పైగా దాటాయి. 2024నాటికి 6600 మందికి సీట్లు లభించేలా ట్రిపుల్ ఐటీ సిద్ధమవుతోంది. టీడీపీ ప్రభుత్వం కేవలం రూ. 43కోట్లు పెట్టి అరకొర నిర్మాణాలు చేపట్టగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 131కోట్లతో జీప్లస్ 5 బ్లాక్‌లను మూడు నిర్మించింది. ప్రస్తుతం రూ. 67కోట్లతో న్యూ అకాడమీ బ్లాక్‌ను ప్రస్తుతం నిర్మిస్తోంది. మరో రూ.133 కోట్లతో ఆరువేల మందికి సరిపడా వసతి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది.

ఆరోగ్య ప్రదాయిని రిమ్స్



మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దయంతో శ్రీకాకుళం రిమ్స్ మెడికల్ కళాశాల ఏర్పాటైంది. ఎంతో మంది వైద్యులను, నర్సింగ్ విద్యార్థులను తయారు చేస్తోంది. టీచింగ్ హాస్పిటల్‌గా రిమ్స్ ఆస్పత్రి విశేష సేవలందిస్తోంది. రిమ్స్ ఏర్పడకముందు ప్రతి చిన్న సమస్యకు విశాఖపట్నం పరుగులు తీయాల్సి వచ్చేది. రిమ్స్ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్ సీట్లు 150 ఉండగా ఐదేళ్లకు కలిపి 750 మందిని వైద్యులుగా తీర్చిదిద్దుతున్నారు. పీజీ సీట్లు 25 వరకు ఉన్నాయి.

చేరువగా పాలిటెక్నిక్ విద్య



జిల్లాలో నాలుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలుండగా, ఐదు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 330 సీట్లు, శ్రీకాకుళం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 210 సీట్లు, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 132, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 132 సీట్లు ఉన్నాయి. వీటి ద్వారా 2212 మంది ప్రస్తుతం చదువుతున్నారు. అలాగే, టెక్కలి ఐతం ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో 132 సీట్లు, ఎచ్చెర్ల వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో 462 సీట్లు, చిలకపాలెం శివానీ పాలిటెక్నిక్‌లో 263, శ్రీకాకుళం రూరల్‌లోని నారాయణ పాలిటెక్నిక్ కళాశాలలో 393, మందసలోని టీవీఆర్ పాలిటెక్నిక్‌లో 297సీట్లు ఉన్నాయి. వీట ద్వారా 4241 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఉత్సవానికి వేళాయె..

- నేటి నుంచి ఆదిత్యుని వార్షిక కల్యాణ మహోత్సవాలు
- ఏప్రిల్ ఒకటిన కల్యాణం, 5న పుష్పయాగం



అరసవల్లి సూర్యదేవాలయం

అరసవల్లి: అరసవల్లిలో ఉషా పద్మిని ఛాయా దేవేరులతో కొలువైన సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. చైత్ర శుద్ధ సప్తమి నుంచి వచ్చే నెల ఐదో తేదీ చతుర్దశి వరకు ఆలయ అనివెట్టి మండపంలో జరగనున్న కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు ఆలయ ధ్వజ స్తంభం వద్ద ధ్వజారోహణ కార్యక్రమం జరుగనుండగా, కల్యాణోత్సవాలను ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ప్రారంభించనున్నారు. వారం రోజులు ఆదిత్యుని క్షేత్రంలో కల్యాణ ఘట్టాలు ఘనంగా జరిగేలా వివిధ శాఖల అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ముఖ్య ఘట్టాలివే..

- కల్యాణోత్సవాల్లో తొలి ఘట్టంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు కల్యాణాంగ ధ్వజారోహణం, పతాకావిష్కరణ
- 31న సాయంత్రం ఏడు గంటలకు సుగంధద్రవ్య మర్దన (కొట్నం దంపు)
- ఏప్రిల్ 1న ఏకాదశి ముహూర్తాన రాత్రి ఏడు గంటల నుంచి కల్యాణ మహోత్సవం
- 2న ఆగ్నేయ స్థాలీపాక హోమాదులు
- 3న వేద పండిత సదస్సు, సత్కారాలు, రథోత్సవం
- 4న తిరుమంగయాళ్వారుల చరిత్ర, సంవాద విన్నపాల ఘట్టం
- 5న ఉదయం ఎనిమిది గంటలకు సుమంగళి అర్చన. అనంతరం ధ్వజావరోహణం. సాయంత్రం ఏడు గంటలకు పుష్పయాగ మహోత్సవంతో కల్యాణోత్సవాలు ముగింపు

కల్యాణ సేవ టిక్కెట్ల విక్రయం



ఆదిత్యుని వార్షిక కల్యాణోత్సవానికి సంబంధించి ఆలయంలోనే రూ.500 ప్రత్యేక టిక్కెట్లను విక్రయిస్తున్నాం. కల్యాణ సేవకు హాజరైన వారికి స్వామి వారి శేష వస్త్రాలను, కల్యాణ తలంబ్రాలను, ప్రసాదాలను అందజేస్తాం. కల్యాణానికి సంబంధించి గత ఏడాది కంటే ఈసారి మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నాం.

– వి.హరిసూర్యప్రకాష్, ఈవో

నేటినుంచి కుతారిచండీ యాత్ర

- 30 వేల మంది హాజరవుతారని అంచనా
- భారీ పోలీసు బందోబస్తు



కుతారిచండీ అమ్మవారు

కవిటి: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ప్రజల ఆరాధ్యదైవం.. వింధ్యగిరిలో వెలసిన కుతారిచండీ అమ్మవారి యాత్ర మంగళవారం రాత్రి నుంచి ప్రారంభం కానుంది. శ్రీరామనవమి ముందు రోజున అశోకాష్టమి నాడు ఇక్కడ యాత్ర జరగడం సంప్రదాయం. కోవిడ్-19 నేపథ్యంలో గత కొన్నేళ్లుగా యాత్రను అధికారులు నిలుపుదల చేశారు. దీంతో ఈ ఏడాది భారీగా భక్తులు హాజరవుతారని అంచనా. బుధవారం రాత్రి వరకూ జరగనున్న జాతర కోసం పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి ఇక్కడకు భక్తులు వస్తారు. అమ్మవారి యాత్రకు కట్టుదిట్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లను చేస్తున్నట్టు సర్కిల్ ఇనస్పెక్టర్ ఈశ్వర్‌చంద్రప్రసాద్, కవిటి ఎస్సై కె.రాము తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, మంచినీటి సౌకర్యం, ఉచిత అన్నప్రసాదం తదితర ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అశోకాష్టమి ముందురోజైన మంగళవారం అర్ధరాత్రి ఆలయ అనువంశిక ధర్మకర్తలు ఒడిశా చీకటిరాజవంశీయుల ఆధ్వర్యంలో మహాదీపం వెలగించే దీపారాధన కార్యక్రమంతో యాత్ర వైభవంగా ప్రారంభమవుతుంది. ప్రధానంగా సంతానం కోసం మొక్కుకున్న వారంతా యాత్ర తొలిరోజునే చేరుకొని తమ చిన్నారులకు తలనీలాలు సమర్పించుకుంటారు. ఈసారి సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అధికారుల అంచనా. ప్రధానంగా వింధ్యగిరిలో నివసిస్తున్న 45 కుటుంబాలవారే ఈ అమ్మవారి అర్చకులుగా కొనసాగుతున్నారు. వీరే ఇక్కడ ఆలయ అభివృద్ధికమిటీ బాధ్యతలుకూడా నిర్వర్తిస్తుండడం విశేషం. రాహుల్‌గాంధీ వ్యక్తిగత సహాయకునిగా పనిచేస్తున్న బరంపురం పట్టణానికి చెందిన రస్మీరంజన్‌పట్నాయక్ ఆలయం అభివృద్ధికి విరాళాలు అందిస్తుంటారు. 20 వేల మంది యాత్రికులకు అన్నప్రసాదాన్ని సిద్ధం చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కవిటి ఎస్సై రాము

● జీ-20 సదస్సులో మన పైలాన్



విశాఖలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జీ-20 దేశాల సదస్సులో సిక్కోలు ముద్ర కనిపించింది. సదస్సు ప్రారంభ సూచికగా వీఎంఆర్డీఏ పార్కులో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పైలాన్ మన శ్రీకాకుళంలోనే తయారైంది. ఈ పైలాన్ తయారీ బాధ్యతను రాష్ట్రంలో పలువురికి అప్పగించారు. కానీ ఏ ఒక్కరూ అనుకున్నట్టుగా తయారు చేయలేదు. మన శ్రీకాకుళం జైలు రోడ్ లో ఉన్న బ్లూ రాక్ మినరల్స్ కంపెనీ వారు తయారు చేసిన పైలాన్ ఉత్తమమైనదిగా ఎంపికైంది. రాజాం మండలం మజ్జి రాముడు పేటలో ఉన్న సందీప్ లుంబా గ్రానైట్ క్వారీలో ఉత్పత్తి చేసిన వైట్ గెలాక్సీ రాక్ను తీసుకుని బ్లూ మినరల్స్ కంపెనీ వారు తయారు చేశారు. ఒక్కో రాక్ 410 కిలోల బరువు ఉండగా, అలాంటివి నాలుగింటితో వారం రోజుల పాటు పైలాన్ తయారు చేశారు. దీన్ని జీ-20సదస్సులో పైలాన్‌గా పెట్టడం, దాన్ని ప్రధానమంత్రి చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించడం జిల్లాకు గర్వ కారణంగా చెప్పవచ్చు. ఈ విషయంపై బ్లూ రాక్ మినరల్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ బాలరాజు సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

జాతీయ హాకీ పోటీల్లో రేవతికి కాంస్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ హాకీ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన బి.రేవతి కాంస్య పతకాన్ని సాధించింది. తమిళనాడు వేదికగా ఈనెల 19 నుంచి 26వ తేదీ వరకు ఆలిండియా సౌత్‌జోన్ నేషనల్స్ అండర్-18 బాలబాలికల హాకీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ బాలికల జట్టు తృతీయస్థానంలో నిలిచింది. దీంతో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సిక్కోలు క్రీడా కుసుమం రేవతి కాంస్య పతకం సాధించినట్టయింది.

డీఎల్‌టీసీ ప్రాంగణంలో జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన జాబ్ మేళా జరగనుందని జిల్లా ఉపాధి అధికారి (ఎఫ్ఏసీ)ఆర్.వహీదా తెలిపారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బలగ ఆస్పత్రి జంక్షన్లో ఉన్న డీఎల్‌టీసీ ప్రాంగణంలో ఉదయం పది గంటలకు మేళా ప్రారంభమవుతోందన్నారు. ఆర్ఎస్ టెలీ సర్వీసెస్, కియా మోటర్స్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, సుష్టిరా ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్, 2050 హెల్త్‌కేర్ కంపెనీ/సంస్థల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి 18 నుంచి 36 ఏళ్లలోపు వయస్సు కలిగి టెన్త్/ఇంటర్/ఐటీఐ/డిప్లమో/డిగ్రీ/బీటెక్ ఉత్తీర్ణులైన యువతీ యువకులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన జీతంతోపాటు అలవెన్సులు, రాయితీలు ఉంటాయన్నారు.

నేలకూలిన కరెంట్ స్తంభాలు

మెళియాపుట్టి: మండలంలో కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద రెండు కరెంటు స్తంభాలు నేలకూలిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేశారు. కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఓ పాన్‌షాప్ గాలికి ఎగిరి రోడ్డుపై పడింది. వసుంధర, కొసమాల, వసుంధర పాఠశాలల్లో నీరు నిల్వ ఉండిపోయింది. చెట్లు కూడా విరిగి పడ్డాయి. జీడిమామిడి పిందె దశలో ఉన్న సమయంలో వడగళ్లతో కూడిన, ఈదురుగాలతో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



మెళియాపుట్టిలో కరెంటు స్తంభాలు పడిన దృశ్యం

హాస్టల్‌లోకి మురుగునీరు

కొత్తూరు: కొత్తూరులో సోమవారం కురిసిన భారీ వర్షానికి ఎస్సీ బాలుర వసతి గృహంలోకి మురుగు నీరు చేరింది. దీంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. మురుగునీటి కాలువ జిరాయితీ భూమిలో ఉండటూ రైతులు పూడ్చేశారు. దీంతో సోమవారం కురిసిన వానకు నీరంతా హాస్టల్లోకి వచ్చేసింది. గదుల్లోకి నీరు వచ్చేయడంతో పుస్తకాలు, దుస్తులు తడిచిపోయాయి. మరో ఆరు రోజుల్లో టెన్త్ పరీక్షలు ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. రాత్రిపూట కావడం దుప్పట్లు కూడా తడిచిపోవడంతో అవస్థలు తప్పలేదు. అధికారులు స్పందించి మురునీటి కాలువ సమస్య నుంచి హాస్టల్‌ను కాపాడాలని విద్యార్థులు కోరుతున్నారు.



కొత్తూరు: వసతి గృహంలోకి మురుగు నీరు చేరడంతో పెట్టెల మీద కూర్చున్న విద్యార్థులు